సాక్షి నిర్మల్
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



ఒలింపిక్స్ ఆడడమే లక్ష్యం

సంప్రదాయ క్రీడ ఖోఖో నేడు వరల్డ్ కప్ స్థాయికి ఎదిగింది. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డి ఒలింపిక్స్ ఆడడమే తన ధ్యేయమంటున్నాడు. 8లో▸



ఊపందుకున్న ఉపాధి

వలసలను నివారించి కూలీలకు ఉన్న ఊరిలోనే పని కల్పించాలని అమలు చేస్తున్న ఉపాధిహామీ సత్ఫలితాలనిస్తోంది. గ్రామాల్లో చేపట్టిన ఈజీఎస్ పనులు జోరుగా సాగుతున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.0 /20.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా, మేఘావృతమవుతుంది. చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సమస్యలపై రాజీలేని పోరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఖానాపూర్: నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై బీజేపీ రాజీలేని పోరాటం చేసిందని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని శివాజీ నగర్‌లో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేశ్‌రాథోడ్‌తో కలిసి నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. బీజేపీ అభ్యర్థులు గెలిస్తేనే గ్రాడ్యుయేట్లకు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధనలో పార్టీ ముందుంటుందని పేర్కొన్నారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆకుల శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు కీర్తి మనోజ్, మండలాధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, నాయకులు గడ్డం రవీందర్, బొప్పారపు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రామారావు

లక్ష్మణచాంద: ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రామారావు పదో తరగతి విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు గత ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు నిర్వహించిన స్లిప్ టెస్టులు, ఇతర పరీక్షల ఫలితాలు తెలుసుకుని హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులను అభినందించారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా సంసిద్ధులను చేయాలని సూచించారు. హెచ్ఎం రాజునాయక్, ఉపాధ్యాయులున్నారు.

22న టెన్నిస్‌బాల్ క్రికెట్ ఎంపిక పోటీలు

నిర్మల్‌టౌన్: టీ10 తెలంగాణ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని లక్కీ క్రికెట్ అకాడమీలో ఈనెల 22న బాలుర జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సుదర్శన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు అకాడమీకి రావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8106108335 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి మార్చి 2వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆర్జీయూకేటీలో నిపుణుల సెషన్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'భారతదేశంలో వ్యవస్థాపక అభివృద్ధి–ఉపాధి అవకాశాలు' అంశంపై ప్రొఫెసర్ మురళీదర్శన్, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) ద్వారా నిపుణుల సెషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ప్రారంభోపన్యాసం చేశారు. వ్యవస్థాపక వెంచర్లు, ఉపాధి మార్గాలను అన్వేషించడానికి ప్రేరేపించడమే లక్ష్యంగా సెషన్‌ను రూపొందించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఉపాధి అవకాశాలు, సవాళ్లను హైలెట్ చేశారు. వ్యవస్థాపకత, ఆవిష్కరణలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు నూతన ఆలోచనలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రణాళికలను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రశ్నలు అడగడానికి, చర్చల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. అసోసియేటెడ్ డీన్ డాక్టర్ విఠల్, హెచ్‌వోడీ నాగసాయి, స్వప్నిల్, స్వాతి, శ్రీవిద్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో చిరుత!

భైంసారూరల్: మండలంలోని సిరాల శివారులో చిరుతపులి కనిపించిందన్న ప్రచారం అందరినీ గాబరా పెట్టింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. సిరాల గ్రామానికి చెందిన రైతు మహేశ్ మొక్కజొన్న సాగు చేశాడు. గురువారం సాయంత్రం నీరు పెట్టేందుకు చేనుకు వెళ్లాడు. చేనుకు నీరు పెడుతుండగా మహేశ్‌కు చిరుతపులి కనిపించగా భయంతో పరుగులు తీశాడు. ఊళ్లోకి వెళ్లి గ్రామస్తులకు చెప్పగా అందరూ పంటపొలానికి చేరుకున్నారు. అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికివెళ్లిన అటవీశాఖ అధికారులు చీకటి పడటంతో ఆనవాళ్లు గుర్తించలేకపోయారు. శుక్రవారం వచ్చి ఆనవాళ్లు సేకరిస్తామని అటవీశాఖ సిబ్బంది శంకర్ తెలిపారు. అప్పటివరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరిగా పంటపొలాలకు వెళ్లవద్దని, చీకటిపడితే గొర్రెలు, మేకల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దీంతో సిరాల గ్రామ రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

సర్వే గౌరవమేది?



- జిల్లాలో 2,34,864 కుటుంబాల వివరాలు సేకరించిన ఎన్యూమరేటర్లు
- ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ కూడా పూర్తి
- ప్రక్రియ పూర్తి చేసి రెండు మాసాలు
- పారితోషికం కోసం సిబ్బంది నిరీక్షణ

నిర్మల్‌చైన్‌గేట్: గతేడాది నవంబర్‌లో జిల్లావ్యాప్తంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వర్తించిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు గౌరవవేతనం కోసం ఎదురుచూస్తున్నారు. సర్వే ప్రారంభానికి ముందే ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. సర్వే సందర్భంగా ప్రజల నుంచి ఎన్యూమరేటర్లు ఎన్నో అవమానాలు, అష్టకష్టాలు ఎదుర్కొంటూ జిల్లాలో ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. సర్వే పూర్తయి రెండు నెలలైనా నేటికీ వీరికి గౌరవవేతనం అందలేదు. దీంతో వారు ఆశగా నిరీక్షిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు పెంచడంతోపాటు సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. దీంతో సర్కారు ప్రతిష్టాత్మకంగా గతేడాది నవంబర్ 6 నుంచి 21 వరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణనకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ వార్డు అధికారులు, సెర్ప్ సిబ్బంది, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా పనిచేశారు. సర్వే సందర్భంగా ఒక్కొక్కరూ 120–150 కుటుంబాల చొప్పున ఎంచుకుని సమగ్రంగా వివరాలు సేకరించారు. సర్వే అనంతరం నవంబర్ 22నుంచి డిసెంబర్ 6వరకు కుటుంబ వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆ సమయంలో కొందరు సర్వేకు అందుబాటులో లేకపోవడంతో తిరిగి మరోసారి వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి వచ్చింది.

2,34,864 కుటుంబాల సర్వే

జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 1,698 మంది ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు. సర్వే పర్యవేక్షణ కోసం మరో 168 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహించారు. ఒక్కో ఎన్యూమరేటర్ 150 కుటుంబాల చొప్పున కేటాయించగా సర్వేను విజయవంతంగా పూర్తి చేశారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో 86 వార్డులు, 400 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 2,34,864 కుటుంబాలకు చెందిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ పరిస్థితులతో పాటు కులం వివరాలు కూడా ఈ సందర్భంగా నమోదు చేసుకున్నారు. ఒక్కో కుటుంబానికి ఎనిమిది పేజీలతో కూడిన సర్వే ఫామ్‌లో 75 రకాల ప్రశ్నలుండగా, ఆయా కుటుంబ సభ్యుల నుంచి ఎన్యూమరేటర్లు ఓపికతో వివరాలు రాబట్టారు. నేరుగా కుటుంబాల వద్దకు వెళ్లి చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, కులం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, వయస్సు, పశు సంపద, దివ్యాంగులు, వైవాహిక స్థితి, చదువు, ఫోన్ నంబర్, వృత్తి, ఉద్యోగం, స్వయం ఉపాధి, వ్యాపారం, కార్మికులు, వార్షికాదాయం, ఆదాయ పన్ను చెల్లింపు, పట్టా భూమి, కౌలురైతు వివరాలు, రిజర్వేషన్ల ద్వారా పొందిన విద్య, ఉద్యోగ ప్రయోజనాలు, గత ఐదేళ్ల నుంచి పొందుతున్న ప్రభుత్వ పథకాలు తదితర వివరాలు సేకరించారు. జిల్లాలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను సిబ్బంది 20 రోజుల్లో పూర్తి చేయడం గమనార్హం.

సర్వే సిబ్బంది వివరాలు

నోడల్ అధికారులు	21
ఎన్యూమరేటర్లు	1,698
సూపర్‌వైజర్లు	168
డాటా ఎంట్రీ ఆపరేటర్లు	2,164
మాస్టర్ ట్రైనర్లు	5

ఎవరికెంత పారితోషికమంటే..

సర్వేలో పాల్గొనే ఎన్యూమరేటర్లకు రూ.10వేల చొప్పున, సూపర్‌వైజర్లకు రూ.12వేల చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో పాటు కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో దరఖాస్తుకు రూ.7 చొప్పున ఇవ్వాల్సి ఉంది. జిల్లాలోని 2,34,864 కుటుంబాల డాటా ఎంట్రీ కోసం 2,164 మంది ఆపరేటర్లు పాల్గొన్నారు. వీరందరికీ కలిపి జిల్లావ్యాప్తంగా సుమారు రూ.2.06 కోట్ల మేర గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తి కాగానే చెల్లిస్తామని రెండు నెలలైనా ఇంతవరకు విడుదల చేయకపోవడంతో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వెంటనే చెల్లించాలి



గత నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేశాం. రెండు నెలలైనా ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదు. అధికారులు స్పందించి డాటా ఎంట్రీ సొమ్ము త్వరగా ఇప్పించాలి. – జీ వెంకటేశ్, ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్

విద్యార్థినుల అభివృద్ధికే బాలశక్తి



విద్యార్థినులతో మాట్లాడుతున్న అభిలాష అభినవ్

లక్ష్మణచాంద: విద్యార్థినుల అభివృద్ధికే బాలశక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో జిల్లా విద్యాశాఖ సహకారంతో ధర్మసేవ చారిటబుల్ ట్రస్ట్, ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగం సాధించిన తరువాతే పెళ్లి గురించి ఆలోచిస్తామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. తరగతి గదులు పరిశీలించి విద్యార్థినుల గణిత సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమం విజయవంతం చేయడంలో ధర్మసేవ సంస్థ, ధీర ఫౌండేషన్, విద్యాశాఖ కృషిని కొనియాడారు. ధర్మసేవ సంస్థ, ధీర ఫౌండేషన్ సారథి జక్కుల నిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని ఎంపిక చేసిన ఏడు కేజీబీవీల్లోని 105 మంది విద్యార్థినులకు ఆన్‌లైన్‌లో యోగ, ధ్యానం, నైతిక విలువలతో కూడిన విద్య, మార్షల్ ఆర్ట్స్, ఆటలు, నేచురల్ లైఫ్ స్టైల్ తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధ రాథోడ్, జిల్లా విద్యాశాఖ ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త ప్రవీణ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, ఎంఈవో అశోక్‌వర్మ, ధర్మ సేవా సంస్థ ప్రతినిధులు అనిల్, స్రవంతిరెడ్డి, నాగరాజు, ఉమా గుప్తా, ప్రేమ్‌సాగర్, జ్యోతి, సునీల్, నవీన్, ధనుంజయ్, కేజీబీవీ ఎస్వో నవిత తదితరులున్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని టీచర్స్, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్‌రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల సామగ్రిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, తహసీల్దార్లు రాజు, సంతోష్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

24 నుంచి వారోత్సవాలు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత, మహిళా సాధికారతపై ఈ నెల 24నుంచి 28 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా మహిళల కోసం ఆర్థిక ప్రణాళిక, పొదుపు నష్ట నివారణ చర్యలు, ఆర్థిక పరిపుష్టికి రుణాలు పొందడం, గృహ రుణాలు, ఉద్యోగినులు, స్వయం ఉపాధి పొందాలనే మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు, ట్రాన్స్‌ఉమెన్, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 25న జిల్లా కేంద్రంలో 2కె రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో మహిళా సంఘాల సభ్యులు, కళాశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సమన్వయంతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పారదర్శకత పాటించాలి

రేషన్ డీలర్లు సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపంపిణీపై పౌరసరఫరాల శాఖ అధికారులు, రేషన్ డీలర్లతో ఆమె సమావేశమై మాట్లాడారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమించిన డీలర్లపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఎస్వో కిరణ్‌కుమార్, డీఎం గోపాల్ పాల్గొన్నారు.

'చేయి' కలపని నేతలు



- కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో వర్గభేదాలు
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఒక్కటిగా ఉండేలా కార్యాచరణ
- పార్టీ అభ్యర్థిని గట్టెక్కించేందుకు ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య గత కొంతకాలంగా సఖ్యత కొరవడింది. పాత, కొత్త నాయకుల మధ్య వర్గ పోరు నడుస్తోంది. ఇదే తీరు కొనసాగితే ఎంపీ ఎన్నికల తరహాలో పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉండడంతో అందరూ కలిసి పని చేసేలా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కృషి చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలు ఎన్నున్నా ఎమ్మెల్సీ అభ్యర్థిని గట్టెక్కించేందుకు ఒకే వేదికపై నిలబడాల్సిన అనివార్యత ఏర్పడుతోంది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎంపీ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో మంత్రి సీతక్కకు ప్రతిష్టాత్మకంగా మారింది.

వర్గభేదాలతో సతమతం

ఆసిఫాబాద్ జిల్లాలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆజ్మీరా శ్యామ్‌నాయక్ మధ్య విభేదాలు బహిరంగంగానే బయటపడ్డాయి. బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు చేరికతో మరింత ముదిరాయి. సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దండే విఠల్, రావి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పార్టీలో ఉన్నారు. ఇటీవల కోనప్ప తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేసిన నిధులను రద్దు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే స్వతంత్రంగానైనా పోటీ చేస్తానని బహిరంగంగానే ప్రకటించారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి తదితరులు హాజరైన ఆత్మీయ సమ్మేళనానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్ దూరంగా ఉండడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మంచిర్యాలలో భిన్న పరిస్థితి

మంచిర్యాల జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఓ ఎంపీ ఉన్నారు. ఇక్కడ పరిస్థితి మరోలా ఉంది. డీసీసీ అధ్యక్షురాలిగా, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు సతీమణి సురేఖ ఉన్నారు. బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం సోదరులైన వినోద్, వివేక్, పెద్దపల్లి ఎంపీగా వివేక్ తనయుడు వంశీకృష్ణ ఉన్నారు. జిల్లాలో పార్టీ రెండు వర్గాలుగా కొనసాగుతోంది. ముగ్గురు ఎమ్మెల్యేలు కలిసికట్టుగా ఒక్క కార్యక్రమం నిర్వహించిన దాఖలాలు లేవు. ఎవరైనా రాష్ట్ర మంత్రులు వచ్చినా ఆయా నియోజకవర్గానికే పరిమితం అవుతున్నారు. మరోవైపు ముగ్గురు ఎమ్మెల్యేలూ మంత్రి పదవి కోసం పోటీలో ఉన్నారు. దీంతో పార్టీ కేడర్ కూడా ఆయా నాయకుల అనుచర వర్గాలుగానే ఉంది.

ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో..

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పాత, కొత్త నేతలు ఇంకా చేతులు కలపడం లేదు. బీఆర్‌ఎస్ నుంచి చేరిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ నుంచి మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బోథ్ నుంచి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పార్టీలో ఇన్నాళ్లు అంటీముట్టనట్లున్నారు. ఖానాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ప్రస్తుత ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మధ్య సఖ్యత లేదు. ఇక బీజేపీని వీడి మాజీ ఎంపీ సోయం బాపూరావు కాంగ్రెస్‌లో చేరారు. ఆదిలాబాద్ డీసీసీ ఎంపిక ఇంకా పూర్తి కాలేదు. ఇక్కడ కంది శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి పోటీ పడుతున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజవకర్గ ఇన్‌చార్జీగా ఆత్రం సుగుణ ఉన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పని చేయాలంటూ ఆదేశాలు రావడంతో విభేదాలు పక్కనబెట్టి పని చేసేందుకు ముందుకు వస్తున్నారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం గురువారం జిల్లా కేంద్రంలోని హోటల్ మారుతి ఇన్‌లో నిర్వహించారు. రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్, బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ బన్సల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ బన్సల్, చంద్రశేఖర్, నాయకులు రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యను మహేశ్వర్‌రెడ్డి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రామారావ్ పటేల్, పాల్వాయి హరీశ్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, నాయకులు, ఇన్‌చార్జీలు, కన్వీనర్లు పాల్గొన్నారు.

పదోన్నతులు వచ్చేనా?

ఆబ్కారీ శాఖలో బదిలీలు, పదోన్నతుల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు.. అప్పుడు అంటూ ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో పలువురిలో నిరాశ వ్యక్తమవుతోంది. అన్ని క్యాడర్లలో ప్రమోషన్ల కోసం నిరీక్షిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఈ సమస్య ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రక్రియ చేపడతారనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ ప్రక్రియ జరిగితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న పలు సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు భర్తీ అయ్యే అవకాశముంది.



ఆదిలాబాద్ డీపీఈవో కార్యాలయం

- ఆబ్కారీ శాఖలో ఎదురుచూపులు
- అన్ని క్యాడర్లలో ఉన్నతి కోసం నిరీక్షణ
- ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రక్రియ అనే ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పలు ఎస్సై పోస్టులు

సాక్షి, ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఆబ్కారీ శాఖలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జరగాల్సి ఉండగా వివిధ కారణాలతో అప్పట్లో నిలిచిపోయింది. దీంతో పలువురు ఈ పదోన్నతుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎక్సైజ్ అధికారి పోస్టు డిప్యూటీ కమిషనర్ (డీసీ) ఖాళీగా ఉంది. కరీంనగర్ డీసీ రవికాంత్ ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో పలువురు అసిస్టెంట్ కమిషనర్లకు పదోన్నతి ఆస్కారం ఉండడంతో ఒకవేళ ప్రక్రియ జరిగితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి డీసీ పోస్టు భర్తీ అయ్యే అవకాశం ఉంది. అంతేకాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి అసిస్టెంట్ కమిషనర్ పోస్టు కూడా ఖాళీగా ఉండగా ఆదిలాబాద్ డీపీఈవో హిమశ్రీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆదిలాబాద్ ఎక్సైజ్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా టాస్క్‌ఫోర్స్ విభాగాలకు సంబంధించి రెండు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతే కాకుండా ఉమ్మడి జిల్లాలో 2 సీఐ పోస్టులు, 9 హెడ్ కానిస్టేబుల్, 17 ఎక్సైజ్ కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతోపాటు మినిస్టీరియల్ ఉద్యోగులు కూడా పదోన్నతులు, బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్సై పోస్టుల వివరాలు

జిల్లా	మంజూరు	ఖాళీలు
ఆదిలాబాద్	10	07
కుమురంభీం	06	01
మంచిర్యాల	10	02
నిర్మల్	07	02

పలు ఎస్సై పోస్టులు ఖాళీ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు ఎస్సై పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లాకు మూడువైపులా మహారాష్ట్ర సరిహద్దుగా ఉంది. దీంతో దేశీదారు అక్రమ రవాణా జోరుగా జరుగుతోంది. దీన్ని అరికట్టడంలో కీలకంగా వ్యవహరించాల్సిన ఎస్సైతో పాటు పలు కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో పర్యవేక్షణ పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న అభిప్రాయం ఆ శాఖలో ఉంది. ఒకవైపు ప్రభుత్వం దేశీదారు, గుడుంబా నియంత్రణకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉండడం ప్రతిబంధకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో పదోన్నతుల ప్రక్రియ ద్వారా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

ఒలింపిక్స్ ఆడడమే లక్ష్యం



ప్రపంచ కప్ ట్రోఫీతో పోతిరెడ్డి శివారెడ్డి



ప్రపంచ కప్ సాధించిన జట్టుతో శివారెడ్డి

- నిరంతర సాధనతోనే వరల్డ్ కప్‌లోకి
- క్రీడారంగంలోనూ ఉజ్వల భవిష్యత్తు
- 'సాక్షి'తో అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డి

ఆదిలాబాద్: దేశంలో సంప్రదాయ క్రీడ అయిన ఖోఖో ప్రస్తుతం ఆదరణ చూరగొంటోంది. ఈ క్రీడ నేడు వరల్డ్ కప్ స్థాయికి ఎదిగింది. ఢిల్లీలో జరిగిన తొలి వరల్డ్‌కప్‌లో పురుషులు, మహిళల జట్లు జగజ్జేతలుగా నిలవడం విశేషం. పురుషుల జట్టుకు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏకైక క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన ఈయన ప్రస్తుతం ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీసులో పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఓవైపు విధులు నిర్వహిస్తూనే, మరోవైపు నిత్యం సాధన చేసి జాతీయ జట్టుకు ఎంపికై ఖోఖోలో వరల్డ్ కప్ టీం సభ్యుడిగా ఫైనల్లో సత్తా చాటాడు. జట్టు ఛాంపియన్‌గా అవతరించడంలో కీలకంగా వ్యవహరించాడు. ఒలింపిక్స్ ఆడడమే తన లక్ష్యమని చెబుతున్న శివారెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

సాక్షి: ఖోఖోపై ఇష్టం ఎలా ఏర్పడింది?

శివారెడ్డి: మా ప్రాంతంలో ఖోఖో ఎక్కువగా ఆడేవారు. మా ఈదర గ్రామంలోని పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు కాశీ విశ్వనాథరెడ్డి అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు. నాతోపాటు ఎంతో మంది క్రీడాకారులకు శిక్షణ అందించారు. పాఠశాలలో ఉన్నప్పుడే 2006 నుంచి ఖోఖోపై ఇష్టం పెరిగింది. అప్పటి నుంచి ఆట ఆడుతున్నాను.

సాక్షి: ఎవరు ప్రోత్సహించారు? శిక్షణ ఎలా సాగింది?

శివారెడ్డి: తల్లిదండ్రులు కోటేశ్వరమ్మ–గురువారెడ్డి. తమ్ముడు పరమేశ్వర్‌రెడ్డి ప్రోత్సహించారు. నా ప్రతిభను గుర్తించి వ్యాయామ ఉపాధ్యాయుడు కాశీ విశ్వనాథరెడ్డి బాపట్ల జిల్లా పుంగలూరు ఎస్.ఆర్ అకాడమీలో చేర్పించారు. శిక్షకుడు సీతారామరెడ్డి మెలకువలు నేర్పారు. 2009లో చేరి 16 ఏళ్లపాటు శిక్షణ తీసుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించాను.

సాక్షి: ఎన్ని పోటీల్లో పాల్గొన్నారు?

శివారెడ్డి: 35 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 2010లో ఎస్జీఎఫ్ అండర్–17 విభాగంలో ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆడాను. 2022లో అల్టిమేట్ ఖోఖో లీగ్‌లో గుజరాత్ జట్టు, 2024లో ముంబై జట్టులో సభ్యుడిగా ఉన్నా. 2018లో లండన్ వేదికగా జరిగిన పోటీల్లో ఇంగ్లాండ్ జట్టుపై ఆడి గోల్డ్ మెడల్ సాధించాం. ఇందులో బెస్ట్ చేజర్‌గా నిలిచాను. ఇటీవల జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన ఖోఖో వరల్డ్ కప్‌లో నేపాల్ జట్టుపైనే గెలిచి ఛాంపియనిషిప్ సాధించడం ఆనందంగా ఉంది. నేపాల్‌తో జరిగిన తొలిమ్యాచ్‌లో బెస్ట్ అటాకర్‌గా నిలిచాను.

సాక్షి: పోస్టల్‌లో ఉద్యోగం ఎప్పుడు సాధించారు?

శివారెడ్డి: 2022 సెప్టెంబర్‌లో స్పోర్ట్స్ కోటాలో పోస్టల్ అసిస్టెంట్ గా ఉద్యోగం సాధించి, ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో జాయిన్ అయ్యాను. రూమ్‌మేట్ అంతర్జాతీయ క్రీడాకారుడు అయిన రంజిత్ సమక్షంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల మైదానంలో ప్రతీరోజు సాధన కొనసాగిస్తున్నాను.

సాక్షి: జాతీయ జట్టుకు ఎంపిక ఎలా జరిగింది?

శివారెడ్డి: 2023 ఏప్రిల్ ఢిల్లీ వేదికగా సీనియర్ నేషనల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని వివిధ రాష్ట్రాల నుంచి పురుషులు, మహిళల జట్లకు 60 మందిని ఎంపిక చేశారు. 2024 డిసెంబర్‌లో ప్రత్యేక శిక్షణ శిబిరంలో నైపుణ్యాలు ప్రదర్శించిన తనతోపాటు పలువురిని జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. 23 దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులతో తలపడి విజేతలుగా నిలవడం సంతోషాన్నిచ్చింది.

సాక్షి: దేశంలో క్రికెట్‌కు ఆదరణ ఉందంటారా?

శివారెడ్డి: దేశంలో క్రికెట్‌కు ఆదరణ ఉంది. మిగతా క్రీడలనూ ఆదరించాలి. గతంతో కన్నా కబడ్డీ, ఖోఖో క్రీడల పట్ల ఆదరణ పెరుగుతోంది. క్రీడాకారులను ప్రోత్సహిస్తే పతకాలు సాధిస్తారు.

సాక్షి: ఎలాంటి ప్రోత్సాహం కోరుకుంటున్నారు?

శివారెడ్డి: మహారాష్ట్ర నుంచి వరల్డ్ కప్‌లో సుమారు 9 మంది జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఐదుగురు పురుషుల జట్టు, నలుగురు మహిళల జట్టులో ఆడారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.2.25 కోట్ల నజరానా ప్రకటించడంతోపాటు గ్రూప్–1 పోస్టింగ్ ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. తెలుగు రాష్ట్రాల నుంచి నేను జాతీయ జట్టుకు ఆడాను. క్రీడా సంఘాలు, ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే ఎన్నో క్రీడారత్నాలు వెలుగులోకి వస్తాయి.

సాక్షి: యువతకు మీరిచ్చే సందేశం?

శివారెడ్డి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించారు. చిన్ననాటి నుంచే పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. మైదానాల్లో శ్రమిస్తేనే వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుంది. యువత క్రీడా రంగాన్ని ఎంచుకుంటే గొప్పగా ఎదిగే అవకాశాలుంటాయి. క్రీడా కోటాలో తాను ఉద్యోగం సాధించాను.

సాక్షి: మీ లక్ష్యం ఏమిటి?

శివారెడ్డి: 2036 ఒలింపిక్స్‌లో ఖోఖోను చేర్చాలని అనుకుంటున్నారు. ఇందుకు ఖోఖో సంఘం కృషిచేస్తోంది. ఒలింపిక్స్‌లో జాతీయ జట్టు నుంచి ఆడాలనేదే తన లక్ష్యం. భవిష్యత్తులో ఖోఖో మంచి స్థాయిలో ఉంటుందని ఆశిస్తున్నాను.

క్లుప్తంగా

బావను కత్తితో పొడిచి హత్య చేసిన నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ

తలమడుగు: బావను కత్తితో పొడిచి హత్య చేసిన ఘటనలో నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ పణీందర్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఈమేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఈనెల 18న కుటుంబ కలహాలతో కోకూరు మహేందర్‌ను బామ్మర్ది కుర్మా అశోక్ కత్తితో పొడి హత్య చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలించారు. ఆదిలాబాద్ సమీపంలో రూరల్ సీఐ, తలమడుగు ఎస్సై అంజమ్మలు నిందితుడిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

ఆటోబోల్తా..నలుగురికి గాయాలు

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలోని ఊరచెరువు కట్ట వద్ద గురువారం ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దస్తురాబాద్ మండలం గొడిసేర్యాల్ నుంచి ఆటో కడెం వైపు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, ఎల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బెల్టుషాపులపై దాడి

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో టూటౌన్ పోలీసులు పట్టణంలోని ఇందిరానగర్‌లో గల బెల్టుషాపులపై గురువారం దాడులు నిర్వహించారు. షేక్ అబ్దుల్ ఫరీద్ నుంచి 2.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2800 ఉంటుందని టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. అదేవిధంగా అదే కాలనీలోని మరట్వార్ మధుకర్ నుంచి 2.6 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ రూ.2770 ఉంటుందన్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు

తప్పుడుపత్రాలతో సర్టిఫికెట్‌కు యత్నించిన వ్యక్తి అరెస్టు

కాసిపేట: తనపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు పత్రాలతో సర్టిఫికెట్ కోసం యత్నించిన వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన కోవెల శ్రావణ్ తనపై ఎలాంటి కేసులు లేవని పోలీసు వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. స్పెషల్ బ్రాంచి ఉన్నతాధికారులు దర్యాప్తు చేయగా శ్రావణ్‌పై చెక్‌బౌన్స్ కేసు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసులకు సూచించారు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో చైన్ చోరీకి విఫలయత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన విజయ ఈనెల 17న మధ్యాహ్నం తన మనువడు చదివే పాఠశాలకు భోజనం అందించేందుకు వెళ్లింది. తిరిగివస్తుండగా బైక్‌పై గుర్తుతెలియని యువకుడు ఆమె మెడలో పుస్తెల తాడును లాగాడు. ఆమె అరవడంతో వదిలి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- ఐదు ఇళ్లు, రెండు కొట్టాలు దగ్ధం



దగ్ధమవుతున్న ఇళ్లు

పెంబి: మండలంలోని రాయదారి గ్రామంలో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మొత్తం ఐదు ఇళ్లు, రెండు కొట్టాలు దగ్ధమయ్యాయి. మధ్యాహ్న సమయంలో రాథోడ్ బిక్కు ఉంట్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగంతో పక్కనే ఉన్న జాదవ్ కిమ్యా, రాథోడ్ నరేశ్, జాదవ్ రవీందర్, రాథోడ్ రవీందర్‌ల ఇళ్లు, బనావత్ దేశాయి, జాదవ్ దినేశ్‌లకు చెందిన కొట్టాలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది రెండు ఫైరింజన్లతో చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. రాథోడ్ బిక్కు ఇంట్లో రూ.6 లక్షలు, కిమ్యా జాదవ్ ఇంట్లో రెండు తులాల బంగారం కాలిబూడిదయ్యాయి. తహసీల్దార్ లక్ష్మణ్, సీఐ సైదారావు, ఎంపీడీవో రమాకాంత్, ఎస్సై హన్మండ్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తమను ఆదుకోవాలని బాధితులు అధికారులను వేడుకున్నారు.

బాధితులను ఆదుకుంటాం: కలెక్టర్

పెంబి/నిర్మల్‌చైన్‌గేట్: అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బాధితులకు రాత్రి భోజనం, బస ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన సంబంధించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆర్థికసాయం, ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు



గంజాయి ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

- సీసీ కెమెరాల వ్యాపారం ముసుగులో దందా
- 23.5 కిలోల గంజాయి స్వాధీనం
- 11 మంది అరెస్ట్, పరారీలో మరో 11 మంది
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో కొంతకాలంగా సీసీ కెమెరాల వ్యాపారం ముసుగులో గంజాయి దందా సాగిస్తున్న ముఠా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. రూ.11.75లక్షల విలువైన 23.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలను గురువారం రామగుండం పోలీసు కమిషనరేట్‌లో సీపీ శ్రీనివాస్ వెల్లడించారు. జిల్లా కేంద్రం ఐబీ చౌరస్తాలో కొంతకాలంగా స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సోమ ప్రవీణ్‌కుమార్ తన సీసీ కెమెరాల దుకాణంలో రాజీవ్‌నగర్‌కు చెందిన ఇరుగురాళ్ల సతీష్‌కుమార్‌తో కలిసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని గంజాయి దందా చేస్తున్నాడు. ఇద్దరికీ గంజాయి తాగే అలవాటు ఉండడంతో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం జిల్లా సీలేరు నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఇక్కడ కొంతమంది యువకులను ముఠాగా ఏర్పాటు చేసుకుని అధిక ధరకు విక్రయించేవారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు గోదాంపై దాడి చేసి గంజాయి ప్యాకెట్లు తీసుకెళ్లడానికి వచ్చిన 11మంది ఇరుగురాళ్ల సతీష్, సప్తగిరి కాలనీకి చెందిన ఎండీ సమీర్, భగవంతంవాడకు చెందిన బీమ అనుదీప్, తిలక్‌నగర్‌కు చెందిన ఎండీ.అబ్దుల్ ఉబేద్, ముంబయికి చెందిన(ప్రస్తుతం కరీంనగర్) అర్జున్ బాబురావు చౌహన్, రాజీవ్‌నగర్‌కు చెందిన జాడి రాఘవేంద్రస్వామి, సీసీసీ నస్పూర్‌కు చెందిన గూడూరు రాము, మంచిర్యాలకు చెందిన ఎస్‌కే.ఇస్మాయిల్, ఎస్‌కే.సమీర్, మరొక మైనర్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి 23.5కిలోల గంజాయి, 11సెల్‌ఫోన్లు, 5మోటార్‌సైకిళ్లు, వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. ముఠా నాయకుడు సోమ ప్రవీణ్‌కుమార్, తగరపు రాజు, తగరపు శృతి(భార్యాభర్తలు), తగరపు వినయ్, రామాలయం రాకేష్, శ్రీధర్, మున్నీ, చింటు, ఆల్మేకర్ శ్యామ్, క్వార్టర్ సాయి, సొహెల్ పరారీలో ఉన్నారు. ముఠా గుట్టును రట్టు చేసిన ఏసీపీ ప్రకాశ్, సీఐ ప్రమోద్‌రావు, ఎస్సైలు, టాస్క్‌ఫోర్స్ బృందాన్ని సీపీ అభినందించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..మండలంలోని చించుఘాట్ గ్రామానికి చెందిన కుమ్ర శంభు (60) కొన్నినెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆసుపత్రిలో పలుమార్లు చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. తీవ్ర మనస్తాపంతో ఈనెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. భార్య కుమ్ర లక్ష్మీబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తిర్యాణిలో మహిళ..

తిర్యాణి: పురుగుల మందు తాగి మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గోయెగం గ్రామానికి చెందిన అంకతి రాజక్క(53) గత కొన్నిరోజులుగా మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 14న రాత్రి ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు గమనించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త రాజయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గాయపడిన యువకుడు..



రాజు మృతదేహం

లక్ష్మణచాందా: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని నర్సాపూర్‌కు చెందిన కస్తూరి రాజు (18) బైక్‌పై బుధవారం నిర్మల్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఖానాపూర్ నుంచి నిర్మల్ వైపు వేగంగా వస్తున్న కారు కనకాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన రాజును నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బుధవారం రాత్రి నిజామాబాద్‌కు పంపించారు. చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కారును అజాగ్రత్తగా నడిపిన పాల్తె వినోద్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు.

రెండు రోజులు సామాజికసేవా శిక్ష

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో ఇటీవల పట్టుబడిన 13 మందిని మంచిర్యాల అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా రెండు రోజులు సామాజిక సేవా శిక్ష తీర్పు విధించిందని ఎస్సై రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్ష అమలులో భాగంగా రెండు రోజుల పాటు ప్రభుత్వ పాఠశాల శుభ్రం చేయించాలని తీర్పులో వెల్లడించినట్లు పేర్కొన్నారు.

'మధ్యాహ్న' నిధులు మంజూరు

- బకాయిల చెల్లింపునకు ఆదేశం
- వంట ఏజెన్సీలకు ఊరట



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిధులు మంజూరయ్యాయి. వంట ఏజెన్సీల నిర్వహణ, గౌరవ వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మంజూరు చేశాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి సంబంధించిన బిల్లుల బకాయిల చెల్లింపునకు ఆదేశాలు జారీ అయ్యాయి. 1 నుంచి 8వ తరగతి వంట ఏజెన్సీలు (కుకింగ్ కాస్ట్), గౌరవ వేతనం బిల్లులు విడుదల చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

బిల్లుల మంజూరులో జాప్యం

మధ్యాహ్న భోజన బిల్లుల మంజూరులో ప్రతీసారి జాప్యంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఓ వైపు ఆకాశనంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, మరోవైపు ఉపాధ్యాయుల నుంచి వచ్చే ఒత్తిడి మేరకు అరువు తెచ్చి నెట్టుకొస్తున్నారు నిర్వాహకులు. నెలల తరబడి మధ్యాహ్న భోజన బిల్లులు రాక పోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులే చదవుతున్నారు. వారికి ఉచిత భోజనం .. పుస్తకాలు, తగిన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు నిధులు ఖర్చు చేస్తున్నాయి. అంతేకాదు మధ్యాహ్న భోజన కోసం సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. నిధులు సకాలంలో రాక నిర్వాహకులు చేతులెత్తేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బిల్లుల విడుదలతో వంట ఏజెన్సీలకు ఊరట నిస్తోంది.

జిల్లాలో..

జిల్లాలో 742 పాఠశాలల్లో 1247 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు (కుక్ కమ్ హెల్పర్)గా పనిచేస్తున్నారు. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు భోజనం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలువుకొని నిధులు విడుదల చేస్తాయి. 9, 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. నెలల తరబడి ఎదురు చూసే మధ్యాహ్న ఏజెన్సీలకు 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సంబంధించి జనవరి, ఫిబ్రవరి సంబంధించిన నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వంట బిల్లులు, కుకు కమ్ హెల్పర్ గౌరవ వేతనం(రూ.1000) మంజూరయ్యాయి. డిసెంబర్, జనవరి పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్డు బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో వంట బిల్లుల వివరాలు..

జిల్లా	1నుంచి 8వ తరగతివరకు	సీసీహెచ్
ఆదిలాబాద్	రూ.1,09,10,738	రూ.36,00,000
ఆసిఫాబాద్	రూ.69,83,912	రూ.30,14,000
మంచిర్యాల	రూ.60,60,712	రూ.25,34,000
నిర్మల్	రూ.81,62,282	రూ.28,28,000

కారును ఢీకొట్టిన లారీ

- ప్రమాదంలో మహిళ మృతి
- మంటలు చెలరేగి దగ్ధమైన కారు
- ఆగిన పెళ్లి.. ఇరు కుటుంబాల్లో విషాదం



కర్రె రాజు (ఫైల్)



మంటల్లో దగ్ధమైన కారు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/భీమిని: మేనల్లుడి పెళ్లి కోసం కారులో పెళ్లికూతురును తీసుకువస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. హాజీపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజాము ఈ ఘటన చోటుచేసుకుంది. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. భీమిని మండలం వీగాం గ్రామానికి చెందిన మహిళ కర్రె రాజు మేనల్లుడి పెళ్లి గురువారం జరగాల్సి ఉంది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన పెళ్లి కూతురును తీసుకురావడానికి ఆమె కారులో వెళ్లింది. పెళ్లి కూతురుతో కలిసి కారులో వస్తుండగా హాజీపూర్ శివారులోని జాతీయ రహదారిపై మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కర్రె రాజు(49) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు డీజిల్ ట్యాంకు లీకేజీ కారణంగా మంటలు చెలరేగి దగ్ధమైంది. మృతురాలికి భర్త మల్లయ్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. కాగా, రాజు మృతితో పెళ్లి ఆగిపోయింది. ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

గిరిజనుడి ఆత్మహత్యాయత్నం

- అటవీ అధికారులు వేధిస్తున్నారని ఆరోపణ
- రేంజ్ కార్యాలయం ఎదుట గిరిజనుల ధర్నా



చికిత్స పొందుతున్న తుకారాం



ధర్నా చేస్తున్న గిరిజనులు

జన్నారం: అటవీ భూమిలో గుడిసెలు వేసుకున్నారనే నెపంతో వాటిని కూల్చివేయడమే కాకుండా అధికారులు వేధిస్తున్నారని గిరిజనుడు విషగుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాలు.. మండలంలోని గడ్డంగూడ గ్రామానికి చెందిన భూమిలో ఏళ్లుగా గుడిసెలు వేసుకుని కొందరు గిరిజనులు ఉంటున్నారు. ఈనెల 18న ఉన్నతాధికారుల ఆదేశాలతో గుడిసెలను తొలగించారు. గురువారం ఉదయం అటవీ అధికారులు అక్కడికి వెళ్లి ఖాళీ చేయాలని సూచించారు. మరో వారం గడువు ఇవ్వాలని, లేదంటే ఇక్కడే చచ్చిపోతామని గిరిజనులు పేర్కొన్నారు. అధికారుల కుదరదని తెలపడంతో మనస్తాపం చెందిన రాథోడ్ తుకారాం విషగుళికలు తిన్నాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు అతన్ని జన్నారానికి తీసుకువచ్చారు. ఆగ్రహంతో రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి బైఠాయించారు. అధికారులు వేధించడం, తిట్టడం వల్లే తుకారాం ఆత్మహత్యాయత్నం చేసినట్లు గ్రామపెద్ద బోడ శంకర్ ఆరోపించారు. పోలీసులు 108లో తుకారాంను లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై జన్నారం రేంజ్ అధికారి సుష్మారావును సంప్రదించగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో గుడిసెలను తొలగించామన్నారు. ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని, వారి ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

అప్పుల బాధతో వలసకార్మికుడు ఆత్మహత్య



గౌరయ్య మృతదేహం

లక్సెట్టిపేట: అప్పుల బాధతో వలస కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని హన్మంతుపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. హన్మంతుపల్లికి చెందిన నస్పూరి గౌరయ్య(50)కు భార్య సత్తవ్వ, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఉపాధి నిమిత్తం 20 ఏళ్ల క్రితం ముంబయి వెళ్లి కూలీ పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. సుమారు రూ.5 లక్షల అప్పు చేసి రెండేళ్ల క్రితం కూతురు పెళ్లితోపాటు ఇల్లు కట్టుకున్నాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెందాడు. గురువారం తెల్లవారుజాము తన ఇంటి గదిలోని స్లాబ్‌కు తాడుతో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అక్కడికి చేరుకుని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.